## అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి : కలెక్టర్ వీపీ గౌతమ్



గ్రీవెన్స్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం, మార్చి 11 : వివిధ సమస్యలపై అర్జీదారులు సమర్పించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ వీపీ గౌతమ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో అర్జీదారుల నుంచి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించి తగు చర్య నిమిత్తం అధికారులను ఆదేశించారు. ఖమ్మం గుట్టలబజార్‌కు చెందిన ఎస్‌డీ.యాకూబ్, ఖమ్మం వెంకటేశ్వర నగర్‌కు చెందిన పి.రజిత, వల్లాల స్వరూపరాణి, ముదిగొండ మండలం మాటూరుపేటకు చెందిన ఎం.వెంకటనర్సమ్మ, తల్లాడ మండలం లక్ష్మీపురానికి చెందిన బి.జగన్మోహన్‌రెడ్డి, తల్లాడ మండలం కేశవపురానికి చెందిన మాగంటి కమల తమ తమ సమస్యలపై కలెక్టర్ వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్‌నాయక్, డీఆర్వో రాజేశ్వరి, ఆర్డీవో గణేశ్, డీఆర్‌డీవో సన్యాసయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి సైన్స్ ప్రదర్శనలో తల్లంపాడు ఫస్ట్



ప్రథమ బహుమతిని అందజేస్తున్న డీఈవో

ఖమ్మం ఎడ్యుకేషన్, మార్చి 11 : ఎన్జీసీ(నేషనల్ గ్రీన్ కార్ప్స్) ఆధ్వర్యంలో నగరంలోని సైన్స్ మ్యూజియం ఆవరణలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ ప్రదర్శనలో తల్లంపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి బహుమతి సాధించారు. బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్ ఇతివృత్తంతో సాగిన ప్రదర్శనలో వ్యర్థాలను సద్వినియోగపరుచుకునేలా తీర్చిదిద్దారు. సైన్స్ టీచర్ తంగెళ్లపల్లి ఉష విద్యార్థులను మోటివేషన్ చేసిన తీరును డీఈవో సోమశేఖర శర్మ అభినందించారు. కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ నారాయణ, దుస్సా జగదీశ్వర్, ఇనుముల వెంకటేశ్వర్లు, ఎం.రాజశేఖర్, ఐలయ్య, శ్రీనివాస్, యాకుబ్, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.22,500 కోట్లు

- రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం
- ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం
- ఇందిరమ్మ ఇళ్ల పథక ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి



భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల నమూనాను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు

ఖమ్మం, మార్చి 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ కచ్చితంగా అమలు చేసి ఇందిరమ్మ రాజ్యమంటే ఏమిటో ప్రజలకు చూపిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరుగ్యారెంటీల్లో ఐదో గ్యారెంటీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకాన్ని ముఖ్యమంత్రి భద్రాచలంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రసంగించారు. రాష్ట్రంలో ఇళ్లు లేని పేదవాడు ఉండకూడదన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకు అనుగుణంగా రాష్ట్రంలో నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని నిర్ణయించామని, ఇందుకు గాను 22,500 కోట్ల రూపాయలను కేటాయించినట్లు ముఖ్యమంత్రి వివరించారు. అందరికీ సొంత ఇల్లు ఉండటమనేది చిరకాల స్వప్నంగా ఉంటుందని, ఆ కల సాకారమైతే అంతులేని ఆనందం ఉంటుందని ఇల్లాలు ఆనందంగా ఉంటే ఆ ఇల్లు ఆనందంగా ఉన్నట్లేనని, అందుకే ఇల్లాలిని చూసి ఇల్లు చూడమంటారని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మహిళల సొంతింటి కల నెరవేర్చడంతో పాటు తాము ఇచ్చే ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరుతోనే పట్టాలు మంజూరు చేయాలని నిర్ణయించామని, అర్హులైన ప్రతి పేదమహిళలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. తాము గత ప్రభుత్వాల మాదిరిగా అలవికాని హామీలివ్వలేదని, ఇచ్చిన హామీని కచ్చితంగా నెరవేర్చామని ఆయన అన్నారు. భద్రాచలం ప్రాంత అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇక్కడ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని, భద్రాచలంలో గతంలో తాను పాదయాత్ర చేసిన సందర్భంగా అనేక సమస్యలు తన దృష్టికి తీసుకువచ్చారని, వాటిని పరిష్కరిస్తామన్నారు. తమ ప్రభుత్వం అధికారం రాగానే రూ.500కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిధులు మంజూరు చేశారని ఆయన అన్నారు. ప్రజల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 లోపు యూనిట్లకు ఉచిత విద్యుత్, రూ.10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాలను అమలుచేస్తున్నామని, కేంద్రంలో మోదీ, గత ప్రభుత్వంలో ఉన్న కేసీఆర్ ప్రజలపై పన్నులభారం మోపారే తప్ప వారు చేసిందేమీలేదని, ప్రధాని మోదీ రూ.60 ఉన్న పెట్రోల్ రూ.110 చేశారని, రూ.50 డీజిల్‌ను రూ.100 చేశారని, గ్యాస్ ధరను రూ.1,200కు పెంచిన ఘనత ప్రధాని మోదీదేనని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమీలేదన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్లను కేసీఆర్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిర్మిస్తే, డబుల్ బెడ్‌రూం నిర్మాణం పూర్తయిన గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఓట్లు అడగాలని, తాము ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తిచేసుకున్న గ్రామాల్లో ఓట్లు అడుగుతామని సవాల్ విసిరారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఎన్ని ఇళ్లు నిర్మించిందో బీజేపీ నేతలు చెప్పాలని, ఈ విషయంపై బీజేపీ నేతలు ఈటల రాజేందర్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ లక్ష్మణ్ సమాధానం చెప్పాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పెద్ద పెద్ద మాటలతో ప్రజలను ఆకర్షించడమే తప్ప సమస్యల పరిష్కారానికి పూనుకున్నది ఏమీలేదన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ నమూనాను ఈ సందర్భంగా సీఎం ఆవిష్కరించారు. ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ధనసరి సీతక్క, కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, సీపీఐ శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, భద్రాద్రి జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ రోహిత్‌రాజు పాల్గొన్నారు.

### రామయ్య సేవలో సీఎం, మంత్రులు

భద్రాచలం, మార్చి 11: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో సోమవారం స్వామివారిని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఇతర మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ దర్శించుకున్నారు.

### ముఖ్యమంత్రి పర్యటనలో అపశ్రుతి భద్రాచలం ఏఎస్పీకి తీవ్ర గాయాలు

భద్రాచలం, మార్చి 11: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రాచలం పర్యటనలో అపశ్రుతి చోటుచేసుకున్నది. సీఎం పట్టణంలోని మార్కెట్ యార్డుకు వస్తున్నారని తెలిసి ఏఎస్పీ పరితోశ్ పంకజ్ అక్కడ పోలీస్ సిబ్బంది బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలో ఏఎస్పీని సీఎం కాన్వాయ్‌లో ఓ వాహనం ప్రమాదవశాత్తు తగిలింది. ఘటనలో ఏఎస్పీ తీవ్ర గాయాలపాలయ్యారు. ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశాల మేరకు అనంతరం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు.

### సారపాక హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం

సారపాక, మార్చి 11: భద్రాచలం పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ముందుగా హెలీకాప్టర్‌లో సారపాక బీపీఎల్ స్కూల్ గ్రౌండ్ హెలిప్యాడ్ వద్ద ల్యాండ్ అయ్యారు. సీఎం వెంట ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు అధికారులు ఉన్నారు.

### ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం: మంత్రులు

భద్రాచలం, మార్చి 11: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తుందని, తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క అన్నా రు. భద్రాచలంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం వారు సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి ఇందిరమ్మ ఇంటి పథకాన్ని ప్రారంభించి అనంతరం మాట్లాడారు. నిరుపేదల కళ్లలో ఆనందాన్ని చూడడమే కాంగ్రెస్ ప్రభు త్వ ధ్యేయమన్నారు. భద్రాచలంలో కరకట్ట వాల్ రివిటింగ్‌కు రూ.500 కోట్లు కేటాయించామన్నారు. ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయన్నారు. అలాగే రామాలయ అభివృద్ధికీ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని హామీ ఇచ్చారు. ఒక్కో నియోజకవర్గం నుంచి 3,500 లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి ఇందిరమ్మ పథకం వర్తింపజేస్తామన్నారు.

### ప్రధాని మోదీ.. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఏమైనయ్ ?

#### మణుగూరు కాంగ్రెస్ పార్టీ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మండిపాటు

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 11 (నమస్తే తెలంగాణ): ఏడాదికి 2 కోట్ల చొప్పున యువతకు ఉద్యోగాలిస్తామని కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం పదేళ్లు పూర్తి కావొస్తున్నా ఆ హామీని పట్టించుకోవడం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. భద్రాద్రి జిల్లా మణుగూరు పట్టణంలో సోమవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. స్విస్ బ్యాంకుల్లోని నల్లధనం తెప్పించి, నిరుపేదల ఖాతాల్లో జమ చేస్తామని నాడు మోదీ ప్రగల్భాలు పలికారన్నారు. ఇప్పటివరకు నల్లధనం తేలేదని, అలాగే పేదల ఖాతాల్లో ఒక్క పైసా కూడా జమ చేయలేదని ధ్వజమెత్తారు. 2022కి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానన్న మోదీ ఇప్పుడు రైతు ఆత్మహత్యలకు కారణమయ్యారని విమర్శించారు. రైతులు మద్దతు ధర కోసం ఢిల్లీ వెళితే వారిపై తూటాలు పేలుస్తున్నారన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో 14 సీట్లు గెలవబోతున్నదన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో తమకు మంచి అనుబంధం ఉన్నదని సీఎం అన్నారు. ఇక్కడి ప్రజలు చైతన్యవంతులన్నారు. 1969లో తెలంగాణ ఉద్యమం పాల్వంచ కేంద్రంగా పురుడు పోసుకున్నదని గుర్తుచేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు విక్రమార్క మాట్లాడుతూ.. తమది పేదల ప్రభుత్వమన్నారు. అందుకే ప్రజలు తమ పార్టీని గెలిపించి అధికారం కట్టబెట్టారన్నారు. తమ ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పదన్నారు.

## రైతుల ఖాతాల్లో 'వ్యత్యాసం' నగదు

### రూ.54.76 లక్షలు జమ చేసిన అధికారులు



ఫ్యాక్టరీకి రైతులు తరలించిన పామాయిల్ గెలలు

అశ్వారావుపేట, మార్చి 11 : గెలల ధరలో వ్యత్యాసం నగదును పామాయిల్ రైతుల ఖాతాలో ఆయిల్‌ఫెడ్ అధికారులు సోమవారం జమ చేశారు. ఆయిల్ ఇయర్ ప్రకారం నవంబర్ నుంచి కొత్త ఓఈఆర్ ఆధారంగా గెలల ధర చెల్లించాల్సి ఉంది. అయితే నవంబర్ నుంచి కొత్త ఆయిల్ ఇయర్‌లో ఓఈఆర్ 19.17 ఉండగా.. జీవో విడుదలకు ఆలస్యం కావడంతో పాత ఓఈఆర్ 19.02 ఆధారంగా గెలల ధరను అధికారులు చెల్లించారు. అయితే కొత్త ఓఈఆర్ జీవో విడుదల కావడంతో గెలల ధరలో వ్యత్యాసం నగదును ఈ ఏడాది ఫిబ్రవరి వరకు మొత్తం రూ.54,75,923.22లను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు ఆయిల్‌ఫెడ్ జీఎం తూర్పు సుధాకర్‌రెడ్డి తెలిపారు. గత ఏడాది నవంబర్ నెలకుగాను 17,710.478 మెట్రిక్ టన్నుల ఆయిల్‌పాం గెలలను రైతులు ఫ్యాక్టరీకి తరలించారు. కానీ.. ఈ నెలకు టన్ను గెలల ధర రూ.12,525.36 ఉండగా.. రూ.12,440 చొప్పున రైతులకు చెల్లించారు. వ్యత్యాసం ధర టన్నుకు రూ.85.36 చొప్పున 17,710.478 టన్నులకు రూ.15,11,766.402, అలాగే డిసెంబర్ 8,533.470 మెట్రిక్ టన్నులకు రూ.12,533. 91లకు రూ.12,440 చొప్పున వ్యత్యాసం నగదును 93.91 చొప్పున రూ.8,01,378.1677 చెల్లించారు. జనవరిలో 5,051.544 మెట్రిక్ టన్నులకు ధర రూ.12,681.32లకు గాను రూ.12,488 చొప్పున చెల్లించగా.. వ్యత్యాసం నగదు టన్నుకు రూ.233.32 చొప్పున రూ.11,78,626.246 చెల్లించారు. ఫిబ్రవరిలో 3,672.656 మెట్రిక్ టన్నులకు రూ.13,135లకుగాను రూ.12,595 చొప్పున రైతులకు చెల్లించారు. వ్యత్యాసం నగదు రూ.540.25 3,672.656 టన్నులకు రూ.19,84,152.404 నగదును రైతులకు చెల్లించినట్లు ఆయన పేర్కొన్నారు. నగదు జమ నిర్ధారణకు బ్యాంక్‌కు వెళ్లి సరిచూసుకోవాలని ఆయన రైతులకు సూచించారు.

# గండికొట్టి పాలేరు నీటి తరలింపు

- రైతులపై పోలీసులకు ఫిర్యాదు
- జేసీబీని సీజ్ చేసిన అధికారులు



గండిపడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఈఈ, తహసీల్దార్, ఎస్సై



పాలేరు చెరువులో జేసీబీతో గండికొట్టిన ప్రాంతం

కూసుమంచి, మార్చి 11 : పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం తగ్గడంతో అనధికారిక ఆయకట్టు రైతులు జేసీబీతో గండికొట్టి నీటిని తరలించిన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. దీంతో సంబంధిత రైతులపై అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పాలేరు పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు కాగా.. ప్రస్తుతం 9.50 అడుగులు మాత్రమే ఉంది. ప్రతి నీటిబొట్టును వృథా చేయకుండా నెల రోజులుగా ఐదు జిల్లాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందిస్తూ జాగ్రత్తలు తీసుకుంటున్న ఇరిగేషన్ అధికారులకు రైతులు షాక్ ఇచ్చారు. జేసీబీతో చెరువుకు గండికొట్టి సుమారు 50 మీటర్ల దూరం కాలువ తీశారు. సోమవారం విషయం తెలుసుకున్న ఇరిగేషన్ అధికారులు గండికొట్టిన రైతుల వివరాలను సేకరించి.. నీటిని వాడుకోకుండా చర్యలు చేపట్టారు.

### నీటిని తరలిస్తే కఠిన చర్యలు

పాలేరు రిజర్వాయర్ పరిధిలో ఎలాంటి అక్రమ నీటి వాడకాలకు పాల్పడినా పోలీసుల సహాయంతో వారిపై చర్యలు తీసుకుంటాం. తాగునీటికే ఇబ్బందులు పడుతున్న తరుణంలో నీటిని అక్రమంగా ఎవరు వినియోగించినా చర్యలు చేపడతాం. ఇరిగేషన్ సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే మాకు తెలియజేయాలి. కాలువలపై సీసీ కెమెరాలు ఉన్న నేపథ్యంలో ఎవరు అక్రమాలకు పాల్పడినా వెంటనే దొరికిపోతారు. – మంగలపుడి వెంకటేశ్వరరావు, ఈఈ

### ఐదుగురిపై ఫిర్యాదు, జేసీబీ సీజ్

పాలేరు రిజర్వాయర్ నుంచి అక్రమంగా నీటిని వాడుకున్న ఐదుగురు రైతులపై చర్య తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎస్సై కిరణ్, డీఈలు రత్నకుమారి, మన్మథరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి.. జేసీబీని సీజ్ చేశారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్య తీసుకుంటామని తెలిపారు.

# సామరస్యమే సమాజానికి రక్ష

### సీపీ సునీల్ దత్



మాట్లాడుతున్న సీపీ సునీల్ దత్



హాజరైన ముస్లిం పెద్దలు

ఖమ్మం, మార్చి 11 : సామరస్యమే సమాజానికి రక్ష అని, దీనికి ప్రతీకగా ఖమ్మం పోలీస్ కమిషనరేట్ ఉన్నదని సీపీ సునీల్ దత్ అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా సోమవారం ముస్లిం మత పెద్దలతో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కులాలు, మతాల వారు సోదరభావంతో మెలగడం మంచి సంప్రదాయమన్నారు. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోందని, ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ శాంతియుత వాతావరణంలో పండుగను జరుపుకోవాలన్నారు. ముస్లింలకు రంజాన్ మాసం పవిత్రమైనదని, నమాజ్ సమయంలో ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని, దీనిపై ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. ఏ సమస్య వచ్చినా మత పెద్దలు తన దృష్టికి తీసుకురావాలని కోరారు. రంజాన్ మాసంలో ముస్లిం మత పెద్దలు, పోలీసులు కలిసి ఒక పీస్ కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. పలువురు ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ప్రతి పండుగను సోదరభావంతో జరుపుకోవడం అనవాయితీగా వస్తోందన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ జి.ప్రసాదరావు, ఎస్బీ ఏసీపీ ప్రసన్నకుమార్, ముస్లిం మత పెద్దలు మహ్మద్ అజీజ్, ఎస్డీ షబ్బీర్, ఎస్డీ మహబూబ్ అలీ, హఫీజ్ మన్నన్, ఎస్డీ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# మిర్చి ధర ఢమాల్

### రోజు వ్యవధిలోనే క్వింటాకు రూ.550 తగ్గుదల
### కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసేందుకు రైతుల మొగ్గు



మిర్చి యార్డుకు రైతులు తీసుకొచ్చిన బస్తాలు

ఖమ్మం వ్యవసాయం, మార్చి 11 : మార్కెట్‌లో తేజా మిర్చి ధర దోబూచులాడుతోంది. నిన్న, మొన్నటి వరకు అంతంతమాత్రంగా పలికిన రేటు ఇప్పుడు తిరోగమనంలో పయనిస్తుండడంతో మార్కెట్‌కు సరుకు తరలించిన రైతులు దిగులు చెందుతున్నారు. గత ఏడాది క్వింటా మిర్చి గరిష్ఠ ధర రూ.25 వేలు పలికింది. ఈ ఏడాది గరిష్ఠ ధర రూ.22 వేలు మాత్రమే పలికింది. అది కూడా ఒకటి రెండు రోజులకే పరిమితమైంది. మార్కెట్‌లో క్రయ విక్రయాలు జరిగిన చివరి రోజు క్వింటా గరిష్ఠ ధర రూ.21,150 పలకగా.. సోమవారం జెండాపాటలో గరిష్ఠ ధర రూ.20,650కే పరిమితమైంది. మధ్య ధర రూ.19 వేలు కాగా.. కనిష్ఠ ధర రూ.13,800 పలికింది. దీంతో రోజు వ్యవధిలోనే క్వింటాకు రూ.550 తగ్గింది. ధర పతనమవుతుండడంతో మార్కెట్‌కు సరుకును తీసుకొచ్చిన రైతులు అమ్మకుండానే కోల్డ్ స్టోరేజీలకు తరలిస్తున్నారు. దీంతో ఉదయం జెండాపాట సమయానికి 20 వేల బస్తాలు మాత్రమే యార్డుకు వచ్చాయి. జెండాపాటలో కేవలం రూ.20,650 పలకగా.. అంతకంటే తక్కువ ధర పడిన రైతులు విక్రయించడానికి అయిష్టత చూపారు. రాబోయే రోజుల్లో చైనా కంపెనీలు తిరిగి తేజా మిర్చి కొనుగోళ్లు ప్రారంభిస్తే మరింత ధర రావొచ్చనే ఉద్దేశంతో కోల్డ్ స్టోరేజీలలో పంటను నిల్వ చేస్తున్నారు.

# తలాకొంత.. పూడికతీతకే అంతా..

- సొంత ఖర్చుతో పంట కాలువ పూడికతీత
- ఎండిపోతున్న వంద ఎకరాలను కాపాడుకున్న రైతులు
- అధికారులు, పాలకులు పట్టించుకోలేదని ఆవేదన





పూడుకుపోయిన పంట కాలువను జేసీబీతో బాగు చేయిస్తున్న రైతులు, పూడిక తీసిన తరువాత పంట కాలువ పరిస్థితి

అశ్వారావుపేట టౌన్, మార్చి 11 : ఆరుగాలం శ్రమించి సాగు చేస్తున్న రైతులు పంటకు నీరందక కళ్లముందు ఎండిపోతుంటే చూడలేకపోయారు. ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూడకుండా తలాకొంత వేసుకుని పంట కాలువలను బాగు చేయించుకొని సాగునీరు అందేలా చేసుకున్నారు పట్టణంలోని వెంకమ్మ చెరువు ఆయకట్టు రైతులు. చెరువు కింద ఆయకట్టు 1,100 ఎకరాలు ఉండగా.. ప్రస్తుత యాసంగి సీజన్‌లో రైతులు 400 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో 40 మంది రైతులు సుమారు వంద ఎకరాల్లో సాగు చేస్తున్న వరి పంట పొట్ట దశలో ఉన్నది. ఈ భూములకు సాగునీరు అందించే మధ్య కాలువ ముళ్ల పొదలు, గడ్డి, పూడికతో పేరుకుపోయింది. దీంతో వంద ఎకరాలకు సాగునీరందక పంట ఎండిపోయే స్థితిలో ఉన్నది. ఈ క్రమంలో పంట కాలువ పరిస్థితిని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని రైతులు సిరిగినీడి దుర్గారావు, కొత్త వాసు, చెన్నూరి రామకృష్ణ తదితరులు ఆరోపించారు. దీంతో కళ్ల ముందు ఎండిపోతున్న పంటను చూడలేని రైతులు తలాకొంత వేసుకొని పంట కాలువను బాగు చేయించుకోవాలని నిర్ణయించుకున్నారు. సోమవారం పొక్లెయిన్‌ను తెప్పించి కాలువలోని ముళ్ల పొదలు, గడ్డి, పూడిక మట్టిని తొలగించి నీరు పారే విధంగా చేసుకున్నారు. ఇప్పటికైనా పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించకుండా పంట కాలువలు బాగు చేయించి సాగు రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

## వ్యాట్‌టాక్స్ వద్దంటూ మద్యం వ్యాపారుల నిరసన



వైరాలోని మద్యం డిపో ఎదుట నిరసన తెలుపుతున్న వ్యాపారులు

వైరాటౌన్, మార్చి 11 : మద్యం అమ్మకాలపై అదనంగా వసూలు చేస్తున్న వ్యాట్‌టాక్స్ నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ వ్యాపారులు వైరా ఐఎంఎల్ మద్యం డిపో ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా వైన్స్ అండ్ బార్ అసోసియేషన్ జిల్లా నాయకులు మాట్లాడుతూ మద్యం అమ్మకాలపై జీఎస్టీ, ఇతర టాక్స్‌లు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీనికి అదనంగా వాట్‌టాక్స్ పేరుతో మరో ఏడు శాతం పెంచడం వల్ల తీవ్రంగా నష్టపోతామన్నారు. వెంటనే దానిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐఎంఎల్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైన్స్ అండ్ బార్ అసోసియేషన్ జిల్లా నాయకులు గుర్రాల శ్రీనివాసరెడ్డి, గొర్రెపాటి నరేశ్, సుబ్బారావు, ఉమ్మడి జిల్లా వైన్ షాపు నిర్వాహకులు పాల్గొన్నారు.

